
ప్రజాశక్తి
ఆదివారం 6 జూలై 2025
విజయనగరం

## భవానికి 3 బంగారు పతకాలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం రూరల్ మండలం కొండకరకాం గ్రామానికి చెందిన రెడ్డి భవాని.. వెయిట్ లిఫ్టింగ్‌లో ఇండియా తరుపున ప్రాతినిధ్యం వహించి, ఆసియన్ యూత్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో మూడు బంగారు పతకాలు సాధించింది. భవాని తండ్రి రెడ్డి ఆదినారాయణ.. తాపీ మేస్త్రి. ఆదినారాయణ ముగ్గురు కుమార్తెల్లో రెండో సంతానం.. భవాని. కుమార్తెను ఎంతో పట్టుదలతో వెయిట్ లిఫ్టింగ్ చేయించాడు. గాదిపల్లి ఆనంద్ శిక్షణ ఇచ్చారు. గ్రామానికి చెందిన యువతి అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటడంతో కొండకరకాం గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.



పతకాలతో భవాని

# జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

**కేంద్ర కార్మిక, రైతు, స్వతంత్ర ఫెడరేషన్ల ఐక్య వేదిక పిలుపు • నగరంలో నేడు బైక్ ర్యాలీ**



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా, స్వతంత్ర ఫెడరేషన్ల ఐక్య వేదిక నాయకులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై ఈ నెల 9న చేపట్టిన జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, రైతు, ప్రజా, స్వతంత్ర ఫెడరేషన్ల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. శనివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, ఐఎఫ్‌టియు నాయకులు కె.అప్పలసూరి, ఐఎన్‌టియుసి నాయకులు అప్పికొండ మధుసూదనరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గాడి అప్పారావు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దేశంలో ఉత్పత్తి రంగాల్లో పని చేస్తున్న వర్గాలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. బ్యాంకులు, ఇన్సూరెన్స్, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రయివేటీకరించి, కార్పొరేట్ దోపిడీదారులకు అప్పగించే పాలనను మోడీ ప్రభుత్వం సాగిస్తోందని ధ్వజమెత్తారు. వెంటనే ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులను బానిసలుగా చేసే 4 లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని విమర్శించారు. వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఆశాలు, అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, శానిటేషన్ వర్కర్లు, విఓఎ, ఆర్‌పిలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

అసంఘటిత రంగ కార్మికులైన ఆటో, ముఠా, బిల్డింగ్, తోపుడుబండ్ల కార్మికులకు పిఎఫ్, ఇఎస్‌ఐతో కూడిన సమగ్ర చట్టం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ పరిశ్రమల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు వెంటనే భర్తీ చేయాలనీ డిమాండ్ చేశారు. డ్రైవర్లకు ఉరితాడుగా ఉన్న మోటారు వెహికల్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఆప్కోస్‌ను కొనసాగించాలని కోరారు. ఇపిఎఫ్ కనీస పెన్షన్ 9 వేలు రూపాయలు ఇవ్వాలన్నారు. మూసివేసిన పరిశ్రమలు తెరవాలని, పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్‌చేశారు. సమ్మెను జయప్రదం చేయాలని ఆదివారం సాయంత్రం కోట జంక్షన్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ర్యాలీలో, 9న జరిగే సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికులు, ప్రజలు, ప్రజా సంఘాలు నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుఎస్ రవికుమార్, సిఐటియు నాయకులు ఎ.జగన్మోహనరావు, బి.రమణ, ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# పంటలకు బీమా కల్పించాలి

**డిసిసి సమావేశంలో కలెక్టర్ అంబేద్కర్**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా పంటలకు బీమా రక్షణ కల్పించాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. అనుకోని విపత్తు సంభవిస్తే ఈ పథకం రైతులకు ఆదుకుంటుందని చెప్పారు. డిసిసి, డిఎల్‌ఆర్‌సి సమావేశాలు కలెక్టరేట్‌లో శనివారం జరిగాయి. పంట బీమా పథకం అమలు, వివిధ పథకాలకు బ్యాంకు రుణాల మంజూరు, పిఎంజెజెబివై, పిఎంఎస్‌బివై, తదితర బీమా పథకాలు, పంట రుణాలు, కౌలుదారులకు గుర్తింపు కార్డులు తదితర అంశాలపై చర్చించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు లీడ్ బ్యాంకు, వ్యవసాయశాఖ ప్రచురించిన వాల్‌పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పత్తి పంటకు వాతావరణ ఆధారిత బీమా సౌకర్యం, వరి, మొక్కజొన్న, నువ్వు పంటకు సాధారణ బీమా సదుపాయం ఉందన్నారు. ఎకరాకు వరి పంటకు రూ.200, మొక్కజొన్నకు రూ.165, నువ్వు పంటకు రూ.65, పత్తి పంటకు రూ.1923 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలో పత్తి రైతులు సుమారు 3,500 మంది, వరి రైతులు లక్షా 67 వేల మంది, మొక్కజొన్న రైతులు 30 వేల మంది ఉన్నారని తెలిపారు. వీరందరూ ఈ పథకాన్ని వినియోగించుకొనేలా చూడాలని కోరారు. బీమా కోసం రైతుల నుంచి ఏజెంట్లు గానీ, మీసేవా కేంద్రాల్లో గానీ నిర్ణీత మొత్తం కంటే అదనంగా వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రస్తుత జిల్లా పరిస్థితులను బట్టి వ్యవసాయం, అనుబంధ శాఖల ద్వారా మాత్రమే జిడిపి పెరుగుదలకు అవకాశం ఉందన్నారు. అందువల్ల వ్యవసాయం వృద్ధి చెందాలంటే బ్యాంకులు రైతుకు సంపూర్ణంగా సహకారం అందించాలని కోరారు. ఈ ఏడాది కౌలురైతులకు రూ.140 కోట్లు రుణం మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని, ఈ లక్ష్యాల సాధనకు కృషిచేయాలని ఆదేశించారు. రైతులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, చేనేత కార్మికులకు త్వరగా రుణాలను మంజూరు చేయాలన్నారు.

సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ నారాయణమూర్తి, డిఆర్‌డిఎ పీడీ కల్యాణచక్రవర్తి, వ్యవసాయశాఖ, పశు సంవర్ధకశాఖ జెడిలు విటి రామారావు, వైవి రమణ, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, నాబార్డు డిడిఎం నాగార్జున, డ్వామా పీడీ శారదాదేవి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ ఇండియా ఖోఖో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సిహెచ్ సత్యనారాయణ సౌత్ ఇండియా ఖోఖో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. తొలిసారిగా జిల్లాకు పదవి రావడం పట్ల ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతా రామరెడ్డి, జిల్లా అధ్యక్షులు పెనుమజ్జి విజయలక్ష్మి, చైర్మన్ పి.చిన్నమనాయుడు అభినందనలు తెలియజేశారు.

## ఆన్‌లైన్‌లో టెన్త్ రీకౌంటింగ్ ఫలితాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫలితాలను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డిఇఒ యు.మాణిక్యంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు ఫలితాలను స్కూల్ లాగిన్‌లో డౌన్‌లోడ్ చేసి, ఆయా విద్యార్థులకు సాఫ్ట్/హార్డ్ కాపీలను అందయజేయాలని సూచించారు.

## 7న పోస్టల్ సేవలకు సెలవు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల ఏడో తేదిన పోస్టల్ కార్యకలాపాలు నిలిపేస్తున్నట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం పోస్టల్ డివిజన్‌లోని ఈ నెల 8న కొత్త సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో 7న పోస్టల్ కార్యకలాపాలు నిలిపేస్తున్నామని, ఖాతాదారులు సహకరించాలని కోరారు.

## అలరించిన సంగీత కచేరీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన నారాయణతీర్థుల 350వ జయంతి ఉత్సవంలో హైదరాబాద్‌కి చెందిన శ్రీనిధి గాత్రకచేరి అలరించింది. కచేరీకి వయోలిన్‌పై భానుహర్ష, మృదంగంపై మొకర మహేశ్వరరావు సహకరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ధవళ సర్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు వై.పి.సన్యాసిరావు, దూసి శివరాంశర్మ, టి.మహేశ్వర రావు, పి.ఆర్.కె.శాస్త్రి, కాంభట్ల శ్రీధర్, రాఘవాచారి, మూర్తి, మృదంగ విద్వాంసులు ఏడుకొండలు పాల్గొన్నారు.

## 10న మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్

**ఈ ఏడాది జూనియర్ కళాశాలల్లో కూడా సమావేశాలు : కలెక్టర్**

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈ నెల 10న జిల్లాలో మెగా పేరెంట్స్- టీచర్స్ మీట్ పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహించామని, ఈ ఏడాది ప్రయివేటు పాఠశాలల్లో, అన్ని జూనియర్ కళాశాలల్లోనూ నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2232 పాఠశాల నుండి 2,10,377 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి హాజరు కానున్నారని తెలిపారు. జిల్లాలో 180 జూనియర్ కళాశాలల నుండి 38,478 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సహా హాజరు కానున్నట్లు వెల్లడించారు. పిల్లలే ఆహ్వానాలను తల్లిదండ్రులకు అందిస్తారని, దాంతో పాటు ఒక ఫార్మాట్ కూడా ఇస్తారని చెప్పారు. తల్లిదండ్రులు ఆ ఫార్మాట్‌పై వారి అభిప్రాయాన్ని రాసి ఇస్తారని పేర్కొన్నారు. పండగలా నిర్వహించే ఈ కార్యక్రమాలలో పాఠశాల అభివృద్ధికి కావలసిన మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల చదువు, భవిష్యత్తు, ఆరోగ్యం తదితర అంశాల పై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలోపే విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేసి, వారి ఆరోగ్య స్థితిపై 10న వారికీ అందించే హోలిస్టిక్ కార్డులో రిమార్క్స్ కాలంలో రిపోర్ట్ చేసి ఇస్తారని తెలిపారు. పూర్వ విద్యార్థులను, అక్కడే చదివి ఉన్నత స్థానాల్లో నిలిచిన గొప్ప వ్యక్తులను కూడా ఆహ్వానించి, సన్మానిస్తున్నట్లు చెప్పారు. పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీసే పలు పోటీలను నిర్వహిస్తారని తెలిపారు. తల్లిదండ్రులకు కూడా రంగోలి, టగ్ అఫ్ వార్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను కూడా అందజేయనున్నట్లు వివరించారు. తల్లి పేరుతో ఒక మొక్క నాటడం ఈ ఏడాది థీమ్‌గా తీసుకున్నామని, పాఠశాల ఆవరణ లో కానీ, లేదా వారి ఇంటి వద్ద గానీ మొక్క నాటవచ్చని తెలిపారు.

## పారాది వద్ద స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని పారాది వంతెన వద్ద శనివారం ట్రాఫిక్ స్తంభించింది. రెండు రోజుల క్రితం పారాది సమీపంలో లారీ బోల్తా పడింది. ఆ లారీ పక్కన శనివారం మరో లారీ బోల్తా పడింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ భారీగా స్తంభించింది. వాహనాలు బారులు తీరడంతో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, ఎస్ఐ రమేష్ క్రేన్ల సహాయంతో లారీలను తొలగించారు. సుమారు మూడు గంటల సమయం ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



నిలిచిపోయిన వాహనాలు

## జెఎన్‌టియులో ఇద్దరికి డాక్టరేట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు-జివిలో శనివారం ఇద్దరికి డాక్టరేట్ ప్రదానం చేశారు. పి.బుజ్జిబాబు 'పర్ఫామెన్స్ ఇవాల్యూషన్ ఆఫ్ డిజిటల్ ఐఐఆర్ ఫిల్టర్ ఆర్కిటెక్చర్స్ ఫర్‌లో పవర్ అప్లికేషన్స్' అనే అంశంపై ప్రొఫెసర్ కె.బాబులు మార్గదర్శకత్వంలో పరిశోధన చేశారు. వి.ప్రశాంత్ 'డైనమిక్ పవర్ ఆప్టమైజేషన్ అండ్ మోడలింగ్ ఆఫ్ మిప్స్ ఆర్కిటెక్చర్ ఫర్ ఎఫ్‌పిజిఎస్' అనే అంశంపై పరిశోధన చేశారు. వీరికి జెఎన్‌టియు-జివి ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ డి.రాజ్యలక్ష్మి డాక్టరేట్ పట్టాలను అందజేశారు.

# ఎస్‌బి పనితీరు కీలకం

**ఎస్‌పి వకుల్ జిందాల్**

ప్రజాశక్తి-కంటోన్మెంట్

శాంతిభద్రతల పరిరక్షణలో స్పెషల్ బ్రాంచ్ పోలీసుల పనితీరు చాలా క్రియాశీలకమని ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందితో జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్‌పి సమావేశమై, క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన విధులపై దిశా నిర్దేశం చేశారు. ఎస్‌బి సిబ్బంది క్షేత్ర స్థాయిలో ముందస్తు సమాచారం సేకరించేందుకు సమాచార వ్యవస్థను మెరుగుపర్చుకోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, రాజకీయ వివాదాలు, కక్షలు, భూతగాదాలు, గ్రూపుల గురించి సమాచారం ముందస్తుగా సేకరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సంఘటనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటిని ముందుగా గుర్తించి, సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించాలని ఆదేశించారు. సాంకేతికతను వినియోగించుకొని ప్రతీ అంశం పట్ల విషయ పరిజ్ఞానం మెరుగుపర్చుకోవాలని తెలిపారు. ప్రజలతో నిత్యం మమేకమవుతూ ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, ఎస్ఐ సత్యనారాయణ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**పోలీసు కుటుంబానికి చేయూత**

పోలీసుశాఖలో ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో కానిస్టేబుల్‌గా పని చేసి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎం.సత్తిబాబు కుటుంబానికి అధికారులు, సిబ్బంది అందించిన రూ.1,47,300 చెక్కును ఎస్‌పి వకుల్ జిందాల్ అందజేశారు. ఈ చెక్కును సత్తిబాబు సతీమణి రాజేశ్వరికి అందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఆఫీసు సూపరింటెండెంట్ టి.రామకృష్ణ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

## పేదల అభివృద్ధి కోసమే 'బంగారు కుటుంబం'

**కమిషనర్ నల్లనయ్య**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదలను ఆర్థికంగా, సామాజకంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మార్గదర్శి - బంగారు కుటుంబం అనే కార్యక్రమాన్ని చేపట్టిందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, అడ్మిన్, వెల్ఫేర్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను బంగారు కుటుంబాలుగా మార్చేందుకు అవసర మైన సహకారాలతోపాటు తగు సూచనలు ఇచ్చేందుకు ఉన్నత స్థితిలో ఉన్న వారిని మార్గదర్శకులుగా మ్యాప్ చేసే ప్రక్రియ ప్రారంభించనున్నామని చెప్పారు. ఈ ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తిచేయాలని కార్యదర్శులకు ఆదేశించారు. సమావేశంలో టిపిఆర్ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.



అన్నక్యాంటీన్‌లో అల్పాహారం తింటున్న కమిషనర్ నల్లనయ్య

**శుచికి, శుభ్రతకు ప్రాధాన్యత**

శుచికి, శుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ అన్న క్యాంటీన్ల ఔన్నత్యాన్ని పెంపొందిస్తున్నామని కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శనివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పారిశుధ్య విధానాన్ని గమనించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను పరిశీలించి అక్కడే అల్పాహారాన్ని స్వీకరించారు. రోజూ ఎంతమంది వస్తున్నారు, ఆహారం ఏ విధంగా అందుతుంది? వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు.

**కమిషనర్‌కు అభినందన**

ఇటీవల జరిగిన సచివాలయ కార్యదర్శుల బదిలీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించారని కమిషనర్ పల్లి నల్లనయ్యను ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. కమిషనర్ ఛాంబర్‌లో అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు టి.శ్రీధర్ బాబు, అసోసియేట్ అధ్యక్షులు జివిఆర్ఎస్ కిశోర్, కార్యదర్శి ఎ.సురేష్, వై.ఆనంద్ కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయితో యువకుడు అరెస్టు

కంటోన్మెంట్ : నగరంలోని అయ్యన్నపేట ప్రాంతానికి చెందిన మజ్జి కృష్ణవర్ధన్ అలియాస్ చెర్రి అనే యువకుడి నుంచి 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. రాయగడ నుంచి గంజాయి తీసుకొచ్చి, నగరంలోని అయ్యన్నపేట వద్దనున్న వాకింగ్ ట్రాకింగ్ వద్ద అనుమానాస్పదంగా చెర్రి సంచరిస్తుండగా ఎస్ఐ ప్రసన్నకుమార్ ఆధ్వర్యాన పోలీసులు పట్టుకున్నారు. చెర్రి వద్ద పదునైన కత్తి ఉందని, ఆయనపై రౌడీషీట్ కూడా నమోదైందని చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ శ్రీనివాస్



నిరసన చేపడుతున్న ఆర్‌టిసి ఉద్యోగులు

## రెండో రోజుకు ఆర్‌టిసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన స్థానిక కాంప్లెక్సు వద్ద రెండో రోజు శనివారం ఉద్యోగుల నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఇయు డిపో అధ్యక్షులు కెఎన్ స్వామి మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సులను ఆర్‌టిసి సిబ్బందితోనే నిర్వహించాలన్నారు. రిటైర్ అయిన ఆర్‌టిసి ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్ క్యాష్‌మెంట్ ప్రభుత్వమే వెంటనే చెల్లించాలన్నారు. డబుల్ డ్యూటీలు చేసే సిబ్బందికి ఇచ్చే డిడి అమౌంట్‌ను పెంచాలని, టిమ్స్ డ్యామేజీలపై రికవరీలను నిలిపేయాలని డిమాండ్‌చేశారు. క్లరికల్ సిబ్బంది, సూపర్‌వైజర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇయు డిపో కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి సిహెచ్‌పి పట్నాయక్, డివిఆర్ఎస్ నారాయణ, కె.వి రమణ, పి.శ్రీను, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 1664 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1664 కేసులను పరిష్కరించారు. విజయనగరంలో 473, పార్వతీపురంలో 119, బొబ్బిలిలో 69, సాలూరులో 229, శృంగవరపుకోటలో 47, గజపతినగరంలో 347, చీపురుపల్లిలో 38, కొత్తవలసలో 320, కురుపాంలో 14.. మొత్తం 1664 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత మాట్లాడుతూ రాజీయే రాజమార్గమన్నారు. కేసులను సామరస్య పూర్వకంగా, స్నేహ పూరిత వాతావరణంలో వివాదాలు లేకుండా పరిష్కరించే ఏకైక మార్గం లోక్ అదాలత్ అన్నారు. కక్షిదారులకు భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు బి.అప్పలస్వామి, ఎన్.పద్మావతి, కె.నాగమణి, ఎ.కృష్ణప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజుకుంటున్న తాటిపూడి రాజకీయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని తాటిపూడి రిజర్వాయరు నీటి రాజకీయం రాజుకుంటోంది. ఎంఎస్ఎంఇ పరిశ్రమల ఏర్పాటు సంగతేమో గానీ, ప్రస్తుతం నీటి రాజకీయం వేడెక్కింది. ఈ వ్యవహారం కాస్త జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు తలనొప్పిగా మారింది. ఇదే అదునుగా మంత్రిని రాజకీయంగా ఇరికించాలని ప్రత్యర్థులు ప్రయత్నిస్తుండగా, తమకేం సంబంధం లేదన్నట్టుగా ప్రతిపక్ష పార్టీ తప్పుకుంటోంది. జిందాల్ భూముల్లో ఎలాంటి పరిశ్రమలు వస్తాయో, వాటికి ఎంతమేర నీటి అవసరాలు ఉంటాయో.. ఇంకా తెలియక ముందే రాద్ధాంతం చేయడం తగదని మంత్రి నిన్నకాక మొన్న క్లారిటీ ఇచ్చారు. ఏమీ జరగకపోతే ఇటీవల కలెక్టర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలంటూ శృంగవరపుకోట ఎమ్మెల్యే, డిసిఎంస్ చైర్మన్ ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందని బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాటిపూడి నీటిని ఎంఎస్ఎంఇ పార్కుకు కేటాయిస్తే సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయంటూ చేస్తున్న ఆందోళన కొనసాగుతోంది. మన జిల్లా మీదుగా ప్రవహించే గోస్తనీ నదిపై గంట్యాడ మండల పరిధిలోని 1963 -1968 మధ్యలో తాటిపూడి జలాశయాన్ని నిర్మించారు. గంట్యాడ, జామి, శృంగవరపుకోట మండలాల పరిధిలో 15,378 ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. నాటి అవసరాల రీత్యా విశాఖ నగరానికి తాగునీటి అవసరాలకు కూడా కొంతనీటిని మళ్లించారు. అప్పట్లో విశాఖతో కుదిరిన ఒప్పంద కాలపరిమితి ముగిసిపోయిన నేపథ్యంలో తాటిపూడి మొత్తం నీటిని సాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించాలనే డిమాండ్ చాలా కాలం క్రితమే రైతుల నుంచి ముందుకొచ్చింది. అనేక సందర్భాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు, విజ్ఞాపనలు అందుతూనే ఉన్నాయి. మరోవైపు అరకు, అనంతగిరి ఏజెన్సీలో తలపెట్టిన బాక్సైట్ తవ్వకాలు ప్రజా ప్రతిఘటన కారణంగా నిలిచిపోవడంతో 2007లో జిందాల్ కోసం శృంగవరపుకోట మండలం మూలబొడ్డవర వద్ద ప్రభుత్వం కేటాయించిన 1166 ఎకరాల భూమి నిరుపయోగంగా ఉండిపోయింది. ఐదేళ్ల కాల పరిమితి దాటడంతో భూములు వెనక్కి తీసుకోవాలన్న నిబంధనను ప్రస్తుతం, గతం.. అనే తేడా లేకుండా మారిన ప్రభుత్వాలన్నీ అతిక్రమించాయి.




ఈ సంగతి కాస్త అటుంచితే... బొడ్డవరలో జిందాల్‌కు కేటాయించిన భూముల్లో ఎంఎస్ఎంఇ పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్టు గతంలో వైసిపి ప్రభుత్వమే 14, 106 జిఒలను విడుదల చేసింది. ప్రస్తుతం టిడిపి కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, గత ప్రతిపాదించిన ఎంఎస్ఎంఇ పార్కుగా మారుస్తున్నామంటూ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇదే జరిగితే తమకు సాగునీటి ఇబ్బందులు తలెత్తుతాయంటూ ఓవైపు రైతులు, రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి తప్ప తమ పార్టీకేమీ సంబంధం లేదని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తేల్చిచెప్పారు. ఎలాంటి పరిశ్రమలు వస్తాయి? ఎంత మేర నీటి అవసరాలు ఉంటాయనేది ఇంకా ప్రభుత్వమే చర్చించలేదని మంత్రి కూడా తేలిపోయారు. ఇదే నిజమైతే వైసిపి హయాంలో 2023 ఫిబ్రవరి 23న జారీచేసిన జిఒ 14 సంగతేమిటనేది రైతులు, వారి తరపున మాట్లాడుతున్న వారి వాదన. ఈ ఉత్తర్వుల ప్రకారం ఎంఎస్ఎంఇ పరిశ్రమకు తాటిపూడి ద్వారా నీటిని కేటాయించాలనే నిబంధన పెట్టారని, అప్పట్లో వైసిపి ఇలాంటి జిఒ ఎందుకు తీసుకొచ్చిందో? టిడిపి ఎందుకు ప్రతిఘటించ లేదో? చెప్పాలని జనం ప్రశ్నిస్తున్నారు. ఆ జిఒను రద్దుచేయకుండా రైతులకు అన్యాయం జరగదని మంత్రి చెప్పడం సరికాదనే వాదన కూడా వినిపిస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపాలనే చిత్తశుద్ధి ఉంటే రాజకీయాలకు అతీతంగా అధికార, ప్రతిపక్షాలు తమ అభిప్రాయాలను వెల్లడించాల్సి ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

## రూ.4.67 కోట్లతో హాస్టళ్ల మరమ్మతులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలోని 23 సాంఘిక సంక్షేమ వసతిగృహాలను రూ.4.67 కోట్లతో మరమ్మతు చేయిస్తున్నా మని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ పనులను ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ, ఆర్ అండ్‌బి తదితర శాఖల అధికారులతో కలెక్టరేట్లో శనివారం సమావేశాన్ని నిర్వహించి, పనుల ప్రగతిపై, విద్యార్థుల హాజరుశాతంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హాస్టళ్ల మరమ్మతులో భాగంగా వారం రోజుల్లోగా అన్ని హాస్టళ్లలో కిటికీలు, తలుపులు బాగుచేయించి, దోమలు రాకుండా మెష్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెండు వారాల్లోగా అన్ని హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్మాణం లేదా మరమ్మతులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. మిగిలిన మరమ్మతు పనులను నెలాఖరుకల్లా పూర్తి చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థుల హాజరు శతశాతం ఉండాలని ఆదేశించారు. ఎవరైనా విద్యార్థులు ఇప్పటికీ హాస్టల్‌లో చేరకపోతే, కారణాలను కనుగొని వారిని రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం నుంచి హాస్టల్ విద్యార్థులందరికీ వైద్య పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వం ఆదేశించిన మెనూను కచ్చితంగా అమలు చేయాలని, ఎక్కడైనా తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ డిడి ఎం.అన్నపూర్ణ, ఆర్ అండ్‌బి ఎస్ఈ కాంతిమతి, వసతిగృహ సంక్షేమాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

## ఇతర బ్యాంకులతో పోటీ పడాలి

ప్రజాశక్తి-గంట్యాడ

జాతీయ, ప్రయివేట్ బ్యాంకులతో పోటీ పడాలని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున.. సిబ్బందికి సూచించారు. శనివారం గంట్యాడలోని డిసిసిబి బ్రాంచిని ఆయన సందర్శించారు. బ్యాంకు ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. బ్రాంచి పరిసరాలను పరిశీలించారు. రైతులకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్థిక సేవలు అందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించాలని సిబ్బందికి చెప్పారు. డిపాజిట్లను పెంచాలని తెలిపారు. జాతీయ, ప్రయివేట్ వాణిజ్య బ్యాంకులతో సమానంగా ఖాతాదారులకు సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సబితా కుమారి, సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## సీతంపేటను ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలి

**ప్రజాశక్తి - శృంగవరపు కోట**

ఎస్‌కోట పంచాయతీలో గల సీతమ్మపేట గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలని ఆ గ్రామ ప్రజలు కోరారు. శనివారం పట్టణంలోని పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్య నిర్వహణాధికారి అనురాధ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో సర్పంచ్ సంతోష్ కుమార్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. ప్రత్యేక పంచాయతీకి కావలసిన అన్ని హక్కులూ ఉన్నందున గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలని కోరారు. తిమిడి గ్రామంలో సర్పంచ్ వబ్బిన తిరునాధమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. జనసేన నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు గ్రామంలో ఇంకా జరగవలసిన కార్యక్రమాలను తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలు తెలపండి

**బొబ్బిలి:** మున్సిపల్ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలుంటే తెలపాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. బుడా, ఎపి మెట్రోపాలిటన్ రీజియన్ అనుమతి పొంది ఈనెల 4న ముద్రించిన డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను శనివారం మున్సిపల్ కార్యాలయంలో ప్రదర్శనకు పెట్టారు. ఈ ప్లాన్‌పై మున్సిపాలిటీలో ఆస్తి ఉన్న వారికి ఎటువంటి అభ్యంతరం ఉన్న ఆగష్టు 4లోగా లిఖిత పూర్వకంగా తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ కిరణ్ కుమార్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాడీ బిల్డింగ్ పోటీల విజేతకు సత్కారం

**బొబ్బిలి:** ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల విజేతను ఎమ్మెల్యే బేబినాయన సత్కరించి అభినందించారు. బాడీ బిల్డింగ్ పోటీలలో క్లాసిక్ విభాగంలో 4వ స్థానం, జూనియర్ మెన్ విభాగంలో 5వ స్థానం సాధించి సత్తా చాటడంతో కోటలో శనివారం అభినందించారు. క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందని, క్రీడలపై ఆసక్తి చూపాలని బేబినాయన కోరారు.

## సొంత డబ్బులతో క్లాప్ మిత్రలకు జీతాలు

**బాడంగి:** మండలంలోని లక్ష్మీపురం పంచాయతీకి సంబంధించి క్లాప్ మిత్రాలకు జీతాలు ఇవ్వావలిసి ఉన్నా పంచాయతీకి నిధులు రాకపోవడంతో కుటుంబాన్ని పోషించుకోలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న సర్పంచ్ పాలవలస పార్వతి, ఎంపిటిసి పాలవలస గౌరి వారి సొంత నిధుల నుంచి ముందుగా రెండు నెలల జీతాలు రూ.24వేలు వారికి అందించారు. విషయం తెలుసుకున్న గ్రామ ప్రజలు సర్పంచ్ ఎంపిటిసిలను అభినందించారు.

## బొత్స జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

**చీపురుపల్లి:** ఈ నెల 8 వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి, 9న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలను జరపనున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచారం విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణలు తెలిపారు. స్థానిక వైసిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం వారు మాట్లాడారు. ఈ నెల 8వ తేదీన దివంగత నేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. బొత్స సత్యన్నారయణ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 9వ తేదీన చీపురుపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపుతో పాటు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఈ రెండు కార్య క్రమాలకు నాలుగు మండలాల నుండి వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొవాలని కోరారు.

## సాధన సేవలకు సత్కారం

**నెల్లిమర్ల:** సాధన యువజన సంఘం ద్వారా చేస్తున్న కార్యక్రమాలకు గుర్తింపు లభించింది. యాక్సెస్ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ బ్యాంక్ విజయనగరం 25వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థలకు సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా సాధన యువజన సంఘం ద్వారా చేస్తున్న రక్తదాన శిబిరాలకు గాను అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్‌రావు (66వ సారి), ప్రధాన కార్యదర్శి, గౌరవ అధ్యక్షులు పసుమర్తి వెంకటరమణ (36వ సారి), మద్దిల కళ్యాణ్ చక్రవర్తి (22వ సారి) రక్తదానం చేసినందుకు వారిని ఘనంగా సత్కరించారు.

## తుమ్మికాపల్లిలో శానిటేషన్ డ్రైవ్

**కొత్తవలస:** వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలో గల తుమ్మీకాపల్లి పంచాయతీలో వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ ఆదేశాలు మేరకు సర్పంచ్ విరోతి కొండలరావు, పంచాయతీ సెక్రటరీ రాజ్ కుమార్, పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యంలో కాలువలు పూడిక తీత, ఓవర్ హెడ్ ట్యాంక్స్ దగ్గర క్లీనింగ్, క్లోరినేషన్, కాలువల్లో దోమలు నిర్మూలనకు దోమలు మందు స్ప్రేయింగ్ చేశారు. సీతంపేట, తుమ్మీకాపల్లి గేట్ దగ్గర వాటర్ ట్యాంక్స్ క్లోరినేషన్, సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, పచ్చ కామెర్లు, డైయేరియా పై ప్రజలకి అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు ఎమ్ఎల్‌హెచ్‌పి కామేశ్వరి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ హేమంత్ కుమార్, ఎఎన్ఎమ్. జ్యోతి, ఆశ వర్కర్స్ వెంకట లక్ష్మి, విజయలక్ష్మి, జగదీశ్వరి, దత్తిలక్ష్మి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో తనిఖీ

**గజపతినగరం రూరల్:** మండలంలోని ఎరువులు, పురుగు మందులు దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. నిలవ వివరాలు, గోడౌన్‌లో నిల్వ, ఈపాస్ మిషన్లో నిల్వ, సరఫరా దారుల వివరాలు లైసెన్స్ నమోదు మొదలగు విషయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి ట్రేడర్స్, శివశక్తి ఆగ్రో కెమికల్స్ దుకాణదారులతో మాట్లాడుతూ అధిక ధరలకు విక్రయించిన, రైతులకు అవసరమైన ఎరువులు ఇవ్వకుండా అనవసర ఎరువులను లింకు పెట్టిన లైసెన్స్ రద్దు చేస్తాం అని హెచ్చరించారు.

## పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలి

**శృంగవరపుకోట:** గ్రామస్థాయిలో జనసేన పార్టీ బలోపేతం కోసం జన సైనికులు అందరూ దృష్టి పెట్టాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వబ్బిన సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో జన సైనికుల వివరాలను సేకరించి తద్వారా పార్టీతో అనుసంధానం చేసే విధంగా కార్యాచరణ రూపొందించి ముందుకు వెళ్లాలని నిర్ణయించామన్నారు. కార్యకర్తల సమస్యలు వారి గ్రామస్థాయిలో ఉన్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకొస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. త్వరలోనే అన్ని మండలాల్లో పార్టీ సమావేశాలు నిర్వహించి వెను వెంటనే నియోజకవర్గం స్థాయిలో కార్యకర్తల సమావేశం ద్వారా స్థానికంగా పార్టీ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు తాండ్రంగి చంటి, టౌన్ ప్రెసిడెంట్ మెపాడ కృష్ణ బాబు, దొగ్గ రమణ, గంధవరపు సతీష్, ఎస్ఎల్‌వి ప్రసాద్, టి.సంతోష్, గోపి శెట్టి ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 7న మడ్డువలస నీరు విడుదల

**వంగర:** మడ్డువలస ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాలువలు ద్వారా ఈనెల 7న మధ్యాహ్నం మూడు గంటలకు ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ చేతుల మీదుగా ఖరీఫ్ పంటలకు ఆయకట్టుకు సాగునీరు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు డిఇ పి.అర్జున్ శనివారం తెలిపారు. వంగర మండలానికి సంబంధించి 996 ఎకరాలకు, రేగిడి మండలానికి 6,777 ఎకరాలకు, సంతకవిటి 10,976 ఎకరాలకు, శ్రీకాకుళం జిల్లాలోని జీ.సిగడాం మండలానికి 6,029 ఎకరాలకు, పొందూరు 99 ఎకరాలకు, స్టేజ్ -1 మొత్తం 24,877 ఎకరాలకు, స్టేజ్ -2లో లావేరు మండలానికి సంబంధించి 5,200 ఎకరాలకు మొత్తం 30,077 ఎకరాలకు సాగునీరు అందిస్తామని వెల్లడించారు.

## నీటి తీరువా బకాయిలపై మండిపాటు

**రేగిడి:** నీటి తీరువా బకాయిలపై అదనంగా ఆరు శాతం వడ్డీ రైతులపై వేయడం ఎంతవరకు సమంజసమని నియోజకవర్గం వైసిపి బీసీ విభాగ అధ్యక్షులు కరణం శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కెంబూరు వెంకటేశ్వరరావు మండిపడ్డారు. శనివారం ఉంగరాడ మెట్ట వద్ద విలేఖరులతో మాట్లాడుతూ సంపద సృష్టిలో భాగంగా నీటి తీరువా బకాయిలు అధిక శిస్తు వసూళ్లతో రాష్ట్రంలో రైతులకు పెనుభారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి తీరువా వసూళ్లతో కూటమి ప్రభుత్వం రైతుల నడ్డి విరుస్తోందని అన్నారు. ఈ సమావేశంలో వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కింజరాపు సురేష్, నెల్లి పెంటంనాయుడు, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

**వేపాడ:** మండలంలోని వల్లంపూడి ఎంపిపిఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం ఏ కోడూరుకు చెందిన దొగ్గ మల్లమ్మ సర్వీస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. వారికి ధన్యవాదాలు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న దొగ్గ మల్లమ్మ సర్వీస్ చారిటబుల్ ట్రస్ట్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

# లేబర్ కోడ్లతో కార్మికులకు తీవ్ర అన్యాయం

**సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె. సుబ్బరావమ్మ**

**ప్రజాశక్తి - పూసపాటిరేగ**

లేబర్ కోడ్ రద్దుతో ఈ ప్రాంత కార్మికులకు తీవ్ర అన్యాయం జరగనుందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె సుబ్బరావమ్మ అన్నారు. శనివారం ఆమె సిఐటియు నాయకులు టివి రమణ, బచ్చల సూర్యనారాయణతో కలిసి మండలంలోని మైలాన్, ఎస్ఎంఎస్, హెచ్‌బిఎల్ పరిశ్రమల వద్ద కార్మికులకు సమ్మె కరపత్రాలు అందజేశారు. లేబర్ కోడ్ రద్దు అమలకు వ్యతిరేకంగా ఈనెల 9న జరగనున్న దేశవ్యాప్తి సమ్మె జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఆమె పూసపాటిరేగలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ లేబర్ కోడ్ రద్దుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీన పెద్ద ఎత్తున సార్వత్రిక సమ్మె జరుగుతోందన్నారు. ఈ సమ్మె అన్ని కార్మిక సంఘాలు జండాలు పక్కనపెట్టి అన్ని రకాల కార్మికులు ఈ సమ్మెలో భాగస్వాములు అవుతున్నారన్నారు. ఈ సమ్మె ప్రధానంగా కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత లేబర్ కోడ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. కార్మికుల కోడ్ రద్దును ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయడానికి అంగీకరించమని కార్మికులు ప్రతిఘటిస్తూ ఈనెల 9న దేశవ్యాప్త సమ్మె చేస్తున్నారన్నారు. సమ్మెకు వ్యవసాయ కార్మికులు, ఉపాధ్యాయులు అందరూ సంఘీభావం ప్రకటించారన్నారు. ఇప్పటికే అనేక పరిశ్రమల్లో కార్మికులు ఎనిమిది గంటల పని అయినప్పటికీ 10 గంటలు చేయిస్తున్నారన్నారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్లో వలస కార్మికులు ఉదయం 8 గంటలకు వెళ్తే సాయంత్రం 8 గంటల వరకు చాకిరీ చేస్తున్నారన్నారు. లేబర్ కోడ్ రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున కార్మికులకు నష్టం జరుగుతోందన్నారు. ప్రతి కార్మికుడికి సామాజిక భద్రత సౌకర్యం కల్పించాలని, స్కీముల్లో పనిచేస్తున్న అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం పథకం, కార్మికులు ఏఎన్ఎమ్స్ రకరకాల స్కీమ్స్‌లో సమాజానికి సేవ చేస్తున్న వారిన కార్మికులుగా గుర్తించాలన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రకరకాల హామీలు ఇచ్చి ఇప్పుడు హామీలన్నీ పక్కనపెట్టి నరేంద్ర మోడీ కార్మిక కోడ్ అమలు చేసే పనిలో ఉందన్నారు. మోడీకి మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన క్యాబినెట్ తీర్మానం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ నెల 9న పెద్ద ఎత్తున జరిగే సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎలు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, మద్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: మాట్లాడుతున్న కె.సుబ్బరావమ్మ

**సిఐటియు ఆలిండియా మహాసభను జయప్రదం చేయండి**

ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరామమ్మ కోరారు. శనివారం సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ ఆధ్వర్యంలో సిఐటియు మండల మహా సభకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి టీవీ రమణ ఆధ్వర్యంలో 12 మందితో కలిసిన సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు.

**లక్కవరపుకోట:** ఈ నెల 9న దేశ్యాప్తంగా జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు కోరారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయ సిబ్బందికి పారిశుధ్య కార్మికులు, క్లాత్ మిత్ర డ్రైవర్ కార్మికులతో కలసి సమ్మె నోటీసును అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు టి వెంకటరమణ, సిహెచ్ అప్పారావు, జి.కామేష్, బి.దేముడు తదితరులు పాల్గొన్నారు.

**బొబ్బిలిరూరల్:** మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కరించాలని స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద ఎంఇఒ లక్షణ రావుకు సిఐటియు ఆధ్వర్యంలో శనివారం సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కోరుతూ జూలై 9 కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని కోరారు ఈ కార్యక్రమంలో మధ్యాన్న కార్మికుల సంఘ అధ్యక్షత, కార్యదర్శి ఏ.రామలక్ష్మీ, నారాయణమ్మ, ఎల్.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై లిఖితంగా ఇవ్వాలి

◆ అధికారులు సమావేశానికి రాకపోతే ఉపేక్షించేది లేదు : ఎమ్మెల్యే ◆ విద్యుత్, రెవెన్యూపై విరుచుకుపడ్డ సభ్యులు

**ప్రజాశక్తి- డెంకాడ**

సమావేశాలకు వచ్చేటప్పుడు ప్రజాప్రతినిధులు ప్రజ సమస్యలపై లిఖితపూర్వకంగా దరఖాస్తు రాసుకొని రావాలని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. భోగాపురం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగమాధవి మాట్లాడుతూ ప్రజ ప్రతినిధులు తమ గ్రామంలో ఉన్న సమస్యలను అన్నీ ఒకదాని మీదే ఒకిటి కాకుండా వేరువేరుగా లిఖితపూర్వకంగా ఏ శాఖ సంబంధించిన సమస్య ఆ శాఖకు రాసుకుని సమావేశాలకు వస్తే ఆయా అధికారులకు చెప్పడానికి బాగుంటుందని తెలిపారు. ఎంపిపి అనూష రెడ్డి మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని దిగువ స్థాయి అధికారులు వస్తే ఉపేక్షించేది లేదని తరువాత జరగబోయే సమావేశాలకు అధికారులందరూ హాజరు కావాలని కోరారు. సమావేశంలో సభ్యులు లేవలెత్తిన సమస్యలను పరిష్కరించి వారికి సమాధానం చెప్పాలని అన్నారు. ముందుగా విద్యాశాఖ పై ఎంఇఒలు మూర్తి, చంద్రమౌళి తమ నివేదికలను చదువుతుండగా ఎమ్మెల్యే కలుగుజేసుకుని అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థుల సంఖ్య పెరిగేటట్టు చూడాలన్నారు. చెరుకుపల్లి సర్పంచ్ దుర్గాలమ్మ మాట్లాడుతూ గ్రామంలో పాఠశాల లేదని, అంగనవాడి భవనం కూడా లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. బైరెడ్డి పాలెంలో ఉన్న పాఠశాల ఎయిర్‌పోర్టు నిర్మాణంలో పోతుందని నిర్మించేందుకు స్థలం లేదని ఆ గ్రామ సర్పంచ్ తెలిపారు. ఈ రెండు చోట్ల పాఠశాల నిర్మాణానికి స్థలం చూసి కేటాయించాలని తహశీల్దార్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యుత్ శాఖ పై జెఇ రమేష వచ్చి మాట్లాడుతుండగా ఒక్కసారిగా సమావేశంలో ఉన్న ఎమ్మెల్యే, ఎంపిపితో పాటు సభ్యులందరూ సమస్యలపై ధ్వజమెత్తారు. ఇంత ముఖ్యమైన సమావేశానికి కూడా ఎఇ రాకపోవడం ఏంటి అని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కువ గ్రామాల్లో లో వైల్టేజ్ సమస్య ఉందని, మరికొన్ని గ్రామాల్లో వీధిలైట్లు రాత్రి పగలు తేడా లేకుండా వెలుగుతున్నాయని, స్తంభాలు పడిపోయే స్థితిలో ఉన్నాయని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా విద్యుత్ శాఖ అధికారులు పెడచెవిని పెడుతున్నారని సభ్యులు మండిపడ్డారు.



అధికారిని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

ఏ.రాయివలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి మాట్లాడుతూ సంవత్సరం నుంచి ముటేషన్లు పెడుతుంటే తిరస్కరిస్తున్నారని ఎందుకు తిరస్కరిస్తున్నారు కారణం కూడా తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిపి మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలు అధికారులు విని పెడ చెవునపెడుతున్నారని ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. వచ్చే సమావేశానికి సభ్యులు అడిగిన సమస్యకు సమాధానం చెప్పాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కిషోర్ కుమార్, తహశీల్దార్ రమణమ్మ, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు

## రైతులను ఆదుకోవాలి

**ప్రజాశక్తి - నెల్లిమర్ల**

నువ్వు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన జరజా పుపేటలో వర్షాలతో తడిచిపోయిన నువ్వు పంటను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు భారీ స్థాయిలో నువ్వుపంటకు నష్టం జరిగిందన్నారు. చేతికి అందివచ్చిన పంటను పొలంలో కుప్పలుగా పెట్టి ఫలితం వచ్చే సమయంలో వర్షాలు కురవడం వల్ల నువ్వు పంట మొక్కలు మొలిచి ఒక్కొక రైతుకి రూ.10వేలు వరకు నష్టం వాటిల్లిందన్నారు. ఎక్కడ చూసినా నువ్వు పంట తడిచిపోయి రైతులు గగ్గోలు పెడుతున్నారని నువ్వు పంట వివరాలు సేకరించి రైతులను ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా స్వామి నాధన్ వ్యవసాయ సిఫార్సులు అమలు జరిపి రైతులకు మద్దతు ధర, సబ్సిడీ పై విత్తనాలు, ఎరువులు, విద్యుత్ అందించి రైతులను, వ్యవసాయ రంగాన్ని రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు అవనాపు నాగేశ్వరావు, కిల్లంపల్లి శ్రీను, సుద్దాపు గోవింద, మద్దిల ముత్యాలు, మద్దిల కృష్ణ పాల్గొన్నారు.

# సుపరిపాలనతో సత్ఫలితాలు: మంత్రి

**ప్రజాశక్తి - మెంటాడ**

కూటమి ప్రభుత్వ సుపరిపాలనతో సత్ఫలితాలు అందుతున్నాయని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల టిడిపి అధ్యక్షులు వెంకటరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**బొబ్బిలి:** ఎన్నికల హామీలు అమలుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. పట్టణంలోని 29వ వార్డులో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నెల్లిమర్ల:** పేదలు ఉన్నత స్థితి కోసం ఆలోచన చేసేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడ అని జిల్లా టిడిపి అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. శనివారం కొత్తపేట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుల సువ్వాడ రవి శేఖర్, మండల అధ్యక్షులు కడగల ఆనందకుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, గురాన అసిరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

**డెంకాడ:** డెంకాడలో శనివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కంది చంద్రశేఖరరావు, కలిదిండి పాణిరాజు, కలిదిండి రంగరాజు, ఎంపిటిసి కొరాడ కుమారి, చలుమూరి మహేష్, పాల్గొన్నారు.

**శృంగవరపుకోట:** మండలంలోని వేములాపల్లి గ్రామాన్ని అభివృద్ధి బాట పట్టిస్తానని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం మండలంలోని వేములపల్లి గ్రామంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, ఎపి టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షులు జీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**గుర్ల:** మండలంలోని కెల్ల గ్రామంలో శనివారం నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు పాల్గొని పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు త్రిమూర్తిల రాజు, వెన్ని సన్యాసినాయుడు, చనమల మహేష్, తిరుమలరాజ్ కిరణ్‌కుమార్ గొర్లె రామనాయుడు, పిల్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరంకోట :** సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని సారిక గ్రామంలో సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేసి, వారి సమస్యలను, అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గండ్రేటి సత్యనారాయణ, టిడిపి గ్రామ అధ్యక్షులు గంగిరెడ్ల సురేష్, నాయకులు పట్నాల మహేష్, మజ్జి గౌరీశ్వరరావు, గంగిరెడ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## బడి బస్సు మంజూరుకు హామీ

**ప్రజాశక్తి - వేపాడ, శృంగవరపుకోట**

ఎస్‌కోట ఆర్‌టిసి డిపో నుంచి సోంపురం, జాకేరు మీదుగా బక్కు నాయుడుపేట వద్ద గల ఎపి ఆదర్శ పాఠశాలకు బడి బస్సు మంజూరు చేస్తానని ఆర్‌టిసి జోనల్ చైర్మన్ దొన్ను దొర శనివారం హామీ ఇచ్చినట్లు వేపాడ మండలానికి చెందిన సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోంపురం, జాకేరు, కరకవలస, మారిక, చామలాపల్లి, పోతుబందిపాలెం, దబ్బిరాజుపేట, వేపాడ మీదుగా బక్కు నాయుడుపేట వద్ద గల ఎపి ఆదర్శ పాఠశాలకు ఎస్‌కోట ఆర్‌టిసి డిపో నుండి బడి బస్సు నడపాలని 2021 నుంచి ఎంపిలకు, ఎమ్మెల్యేలకు, జిల్లా కలెక్టర్‌కు, ఎస్‌కోట డిపో మేనేజర్‌కు పలుమార్లు వినతి పత్రాలు ద్వారా విన్నవించుకున్నామన్నారు. అయినప్పటికీ బడి బస్సు మంజూరు చేయకపోవడంతో మంత్రి నారా లోకేష్‌కి, ఆర్‌టిసి జోనల్ చైర్మన్ దొన్నుదొరకు కూడా వినతినివ్వడంతో వెంటనే ఈ రూట్‌లో బడి బస్సు నడపాలని డిపో మేనేజర్‌కి ఆదేశించినప్పటికీ బస్సు వేయలేదన్నారు. డిపోలో కొంతమంది ఆర్‌టిసి సిబ్బంది ప్రైవేటు స్కూల్లో యాజమాన్యాలతో కుమ్మక్కై బడిబస్సును వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఆర్టిసి జోనల్ చైర్మన్ దొన్ను దొరకు శనివారం తెలిపగా బస్సు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని అప్పారావు తెలిపారు.

## యుటిఎఫ్ వంగర మండల అధ్యక్షులుగా ప్రసాదరావు



**వంగర:** యుటిఎఫ్ వంగర శాఖ అధ్యక్షుడిగా బలగ ప్రసాదరావు ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో యుటిఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ సీనియర్ నాయకులు కాంబోతుల రమణ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో బదిలీ పొందిన యుటిఎఫ్ వంగర శాఖ అధ్యక్షుడు మర్రాపు ప్రసాద్ స్థానంలో బలగ ప్రసాద్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి పెంకి గౌరీశంకర్, పల్ల మురళి, పాల్గొన్నారు.

## పంటలకు నష్టం కలిగించినా పట్టించుకోరా?

**ప్రజాశక్తి - వంగర**

ఏనుగులు పంటలను ధ్వంసం చేసినా పట్టించుకోవటం లేదని, వీటిని తరలించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి, ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. వంగరలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఏనుగులు మండలంలోని మరువాడలోకి ప్రవేశించినప్పటి నుంచి ఇప్పటివరకు నీలయ్య వలస, జగన్నాథవలస, మడ్డువలస, సంగాం, ఓని అగ్రహారం తదితర గ్రామాలలో సంచరించి చెరకు, వరి, పామాయిల్, మొక్కజొన్న తదితర పంటలను ధ్వంసం చేశాయని పంటలు నష్టపోయిన రైతులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించే విషయంలో గానీ, ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించే విషయంలో కానీ అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మండలంలో ప్రస్తుతం ఏనుగులు విధ్వంసం చేస్తుంటే ఎవరు పట్టించుకోవటం లేదని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించేందుకు కర్ణాటక నుండి కుంకి ఏనుగును తెప్పించి మన రాష్ట్రంలో మైదాన ప్రాంతాలలో సంచరిస్తున్న ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలిస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు అలాంటి చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని, ఏనుగులను ఇక్కడ నుండి అటవీ ప్రాంతానికి తరలించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు బొక్కేల వెంకటప్పలనాయుడు, పోలిరెడ్డి రమేష్, కాంబోతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఘనంగా అల్లూరి జయంతి

**బొబ్బిలి:** మన్యం విప్లవ వీరుడు స్వతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి శనివారం స్థానిక బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, బాలుర గురుకుల పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ బొబ్బిలి పట్టణ కార్యదర్శి శివ, ఎస్ఎఫ్ఐ నాయకులు జానీ, మహేష్, విద్యార్థులతో కలిపి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పేద ప్రజల తరపున దేశ స్వతంత్రం కోసం ప్రాణాన్ని అతి చిన్న వయసులో త్యాగం చేసిన మహానుభావుల్లో అల్లూరి సీతారామరాజు మొదటి వరుసలో ఉంటారని అన్నారు. విద్యా వ్యవస్థని ప్రభుత్వం కాలరాస్తున్న సందర్భంలో విద్యార్థులు అల్లూరి సీతారామరాజుని ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలని ఆయన అన్నారు. అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను విద్యార్థులకు తెలిసేటట్టు పాఠ్యాంశాల్లో పొందుపరచాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఇటువంటి అమర యోధులు త్యాగాలు ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు.

## విద్యా శాఖ చర్యలు విడ్డూరం

**ప్రజాశక్తి- బొబ్బిలి**

విద్యాశాఖ చర్యలు విడ్డూరంగా ఉన్నాయని ఈ విట్‌నెస్‌లు, డాక్యుమెంటేషన్‌లు, లెక్క లేనన్ని యాప్‌లలో సమాచారం అప్‌లోడ్ చేయడం వంటి చర్యలు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికా, బలహీనం చేయడానికా అని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇప్పటికే పాఠశాలల్లో టీచర్లు సరిపడా లేక ఒకవైపు, విలీనాలతో మరోవైపు, టీచర్లు కుదింపులతో ఇంకోవైపు ఇబ్బందులు పడుతున్నారన్నాఉ. టీచర్లను స్కూళ్ళలో లేకుండా మిగులు టీచర్లు సాకుతో క్లస్టర్ అనే పేరుతో క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లకు నియమించడం వంటి సమస్యలతో పాఠశాలలు తెరిచినప్పటి నుండి సతమతమవుతూ ఉంటే, ఇప్పుడు మెగా పేరెంట్స్ మీటింగ్‌లో వాళ్ళు ఇచ్చిన ఎజెండా అంతా జరిపినట్లు విట్ నెస్ అధికారిని నియమించాలని, చేసిన కార్యక్రమాలకు సాక్ష్యాలు కావాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు ఎపి విద్యారంగంలో ఇటువంటి పరిస్థితి మునుపెన్నడూ లేదని ఆమె అన్నారు. 17రకాల కమిటీలు వేయాలని, అన్ని కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలను అప్లోడ్ చేయమని, దాని కోసం డాక్యుమెంట్ కమిటీలుగా మార్చడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. యోగా పేరుతో కొన్ని రోజులు బోధన కుంటుపడిందని, ఇప్పుడు మెగా పేరెంట్స్ మీటింగ్‌లు, అందులో విట్‌నెస్ అధికారులు పేరుతో మరికొన్ని రోజులు బోధనేతర పనులతో బోధనకు ఆటంకం కలిగించడం సరైనది కాదని దీన్ని యుటిఎఫ్‌గా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఇటువంటి నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నవధాన్యాల్లో పంట కోత ప్రయోగం

**వేపాడ:** మండలంలోని కుమ్మపల్లిలో నర్సీపల్లి వెంకటరమణ మామిడి పంటలో నవధాన్యాల్లో పంట కోత ప్రయోగం చేశారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మామిడి తోటల్లో నవధాన్యాలు రైతులతో సాగు చేయించారు. ఈ సందర్భంగా రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమ సుందర్ మాట్లాడుతూ మామిడి పంటలు పూర్తయిన తరువాత మే నెల ఆఖరి వారంలో, జూన్ మొదటి వారంలో నవధాన్యాలు వెయ్యడం వల్ల ఖరీఫ్‌లో కాయగూరలు, రాగి, ఇతర పంటలు వెయ్యడం వల్ల ఆదాయం వస్తుందన్నారు. ఇంటి వినియోగానికి ఆకుకూరలు, కాయగూరలు వాడుకొనవచ్చు నన్నారు జీవ వైవిధ్య పంటలు వేయడం వల్ల భూములో సూక్ష్మజీవులు పెరగడంతో పాటు పంటగా అవసరమైన పోషకాలను అందిస్తాయన్నారు. పంట కోత ప్రయోగంలో మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ, ఈశ్వరరావు, మెంటర్ మదీనా, ఫార్మర్ సైంటిస్ట్ ధనలక్ష్మి, యూనిట్ ఇంచార్జ్ నారాయణమ్మ, రైతులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలపై దాడులు

**పూసపాటిరేగ:** నేషనల్ లోక్ అదాలత్‌లో భాగంగా భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఐదు కేసులను శనివారం పరిష్కరించారు. సంబంధిత ముద్దాయిల నుండి రూ. 53,730 అపరాధ రుసుముగా వసూలు చేశారని ఎక్సైజ్ సిఐ వి.రవికుమార్ తెలిపారు. అనధికార మద్యం దుకాణాలపై జరుగుతున్న దాడులలో భాగంగా పూసపాటిరేగ మండలంలోని కోనాడ గ్రామంలో ఒక వ్యక్తిని 10 మద్యం బాటిల్స్‌తో అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని తెలిపారు.

## మద్యం షాపులో చోరీ

**ప్రజాశక్తి - సంతకవిటి**

మండల కేంద్రంలోని మద్యం షాపులో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనకు సంబదించి ఎక్సైజ్ ఎస్ఐ జి.మాన్యాలు తెలిపిన వివరాలు ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి మద్యం షాప్ వెనుక నుంచి రంధ్రం చేసి షాపులో చొరబడి షాపు లోని ఉన్న కంప్యూటర్ హార్డ్ డిస్క్‌తో పాటు రూ.24,260 విలువ గల మద్యం సీసాలు, కౌంటర్‌లోని రూ.14వేలు నగదును దొంగలించిన్నట్లు షాపు నిర్వాహకుడు పేడాడ గోవిందరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఘటనస్థలాన్ని రాజాం ఎక్సైజ్ ఎస్ఐ జి. మాన్యాలు, సంతకవిటి ఏఎస్ఐ వాసుదేవరావు శనివారం పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉరేసుకుని యువకుడు మృతి

**ప్రజాశక్తి - వంగర**

మండలంలోని కొప్పర గ్రామానికి చెందిన బూరి శ్రీనివాసరావు(29) శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజాంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్.ఐ రవి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావు బజాజ్ ఫైనాన్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తూ రాజాం పట్టణంలో గల తెలగ వీధిలో ఓ రూమ్‌లో తన స్నేహితులతో కలసి ఉంటున్నాడు. గత కొద్ది రోజులుగా కడుపులో విపరీతమైన నొప్పి వస్తున్నట్లుగా తన తండ్రి నారాయణరావుకు కూడా రెండు రోజుల క్రితం తెలిపాడు. కుమారుడు ఎలా ఉన్నాడో తెలుసుకుందామని శనివారం ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో అదే రూమ్‌లో ఉంటున్న రామ్ కుమార్‌కు ఫోన్ చేసి ఓసారి రూమ్‌కి వెళ్లి చూడాలని చెప్పగా ఆయన వెళ్లి చూసేసరికి శ్రీనివాసరావు రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్న విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తన కుమారుడు విపరీతమైన కడుపు నొప్పి తాళలేక ఉరేసుకుని ఉంటాడని మృతుని తండ్రి నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి కిరణ్ తెలిపారు.

## పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాశక్తి - చీపురుపల్లి**

రాష్ట్రంలో పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు మండలాల తహశీల్దారులు, ఎంపిడిఒలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2029 నాటికి జీరో పవర్టీ లక్ష్యంగా ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని అన్నారు. నిరుపేద కుటుంబాలను పి-4 ద్వారా బంగారు కుటుంబాలుగా మార్చేందుకు యత్నిస్తున్నారన్నారు. అందులో బాగంగానే నియోజక వర్గంలో గల నాలుగు మండలాలలో ఉన్న పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సేవా సంస్థలను గుర్తించి పి-4 ద్వారా పేద కుటుంబాలను వారు దత్తత తీసుకొనే విధంగా మోటివేట్ చేయాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. నిరుపేదల ఆర్థిక స్వాలంభన కోసం పారిశ్రామిక వేత్తలు, ప్రజాప్రతినిధులు మానవతా ధృకృధంతో ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. పి-4 ద్వారా పేదలకు ఏ విధంగా సాయాన్నందించాలనే దానిపై అన్ని మార్గాలను అధికారులు అన్వేషించాలని సూచించారు. ఈ సమావేశంలో చీపురుపల్లి తహశీల్దారు ధర్మరాజుతో పాటు గరివిడి, మెరకముడిదాం, గుర్ల తహశీల్దారులు, చీపురుపల్లి ఎంపిడిఒ కె సురేష్‌తో పాటు నాలుగు మండలాల ఎంపిడిఒలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.